ప్రజాశక్తి
గురువారం 3 ఏప్రిల్ 2025 5
అనంతపురం



గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా జెసి బాధ్యతల స్వీకరణ



జెసికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రంథాలయ సంస్థ సెక్రటరీ రమ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా గ్రంథాలయం సంస్థ ఛైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలకు సంబంధించిన వ్యవహారాలను నిర్వహించడానికి జిల్లాల జాయింట్ కలెక్టర్‌లను పర్సన్-ఇన్‌ఛార్జులుగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం జిల్లా గ్రంథాలయం సంస్థ ఛైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయం సంస్థ అభివద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్‌ను గ్రంథాలయ సంస్థ సెక్రటరీ రమ, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



తూమకుంట పారిశ్రామిక వాడ వీర్గో పరిశ్రమలో బాయిలర్‌కు వినియోగిస్తున్న కలప

- పచ్చని చెట్లు ఆహుతి
- నిబంధనలకు విరుద్ధంగా వినియోగం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- స్పందించకుంటే పర్యావరణానికి పెనుప్రమాదం

పరిశ్రమల్లో కాలుతున్న కలప..!

హిందూపురం ప్రాంతం సమీపంలో వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల వల్ల ఈ ప్రాంతవాసులకు పూర్తిస్థాయిలో ఉపాధి లభించకున్నా అందులోనుంచి వెదజల్లే కాలుష్యాన్ని మాత్రం ప్రజలు పీల్చి అనారోగ్యం బారిన పడుతున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు ఇదే ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో పడేయడంతో కాలుష్యం మరింత అధికం అవుతోంది. ఇది చాలదన్నట్లు పరిశ్రమలకు ఉపయోగించే కలప కోసం పచ్చని చెట్లను నరికి వినియోగించడం వల్ల పచ్చని చెట్లు ఈ ప్రాంతంలో కనుమరుగవుతున్నాయి. దీంతో త్వరలో ఈ ప్రాంతం ఎడారిగా మారిపోవడంతో పాటు కాలుష్యం వల్ల వింత వ్యాధులతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆటోలో తీసుకొచ్చి పరిశ్రమలో దించుతున్న కలప

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పారిశ్రామిక వాడలోని కొన్ని పరిశ్రమల్లో ఉపయోగించే బాయిలర్లకు అటవీ సంపదను వినియోగిస్తున్నారు. ప్రతి పరిశ్రమ నిబంధనల మేరకు వారికి కేటాయించిన స్థలంలో 33 శాతం స్థలంలో చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉంది. ఈ నిబంధనను పురం సమీపంలోని పరిశ్రమ నిర్వాహకులు గాలికి వదిలేశారు. 33 శాతం చెట్లను పెంచడం పక్కన పెట్టి ఉన్న చెట్లను సైతం నరికి పరిశ్రమల్లో బాయిలర్లకు వినియోగిస్తున్నారు. తూమకుంట, గోలపురం పారిశ్రామిక వాడలో ఉన్న వీర్గో అట్టల పరిశ్రమతో పాటు మరికొన్ని పరిశ్రమల నిర్వాహకులు చెట్ల నుంచి తీసిన కలపను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారు. వీరితో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండలంలో ఉన్న గవర్నమెంట్ పరిశ్రమలు సైతం పచ్చని చెట్లను నరికి వారి పరిశ్రమల్లో వినియోగిస్తున్నారు. పరిగి మండలం పైడిటి రోడ్డులో ఉన్న పరిశ్రమలో సైతం పెద్ద ఎత్తున పచ్చని చెట్లను బయిలర్లకు ఉపయోగిస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అధికారులు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు అక్రమ కలప వ్యాపారానికి ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటవీశాఖ, పర్యావరణ అధికారులతో పాటు రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి పచ్చని చెట్లు పరిశ్రమల్లో కాలుతున్నాయి.

అనుమతుల్లేవని అధికారులకు తెలిసినా..

పరిశ్రమల్లో కలపను ఉపయోగించడానికి అనుమతులు ఉన్నాయా అని పర్యావరణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిప్రసాద్‌ను అడిగితే ఆయన అనుమతులు లేవని స్పష్టంగా చెబుతున్నారు. కొన్ని పరిశ్రమ నిర్వాహకులు కలపను ఉపయోగిస్తున్నారని ఆయనకు గతంలో ఫిర్యాదు చేస్తే, పరిశ్రమలను తనిఖీ చేసి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప చర్యలు మాత్రం తీసుకోలేదు. ఇలా వందలాది మహావృక్షాలు పరిశ్రమల్లో కలపగా కాలిపోతుంటే భవిష్యత్తులో అటవీ సందపద కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతం ఏడారి కాక ముందే అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు అధికారులు తొత్తులుగా వ్యవహరించకుండా నిబంధనల మేరకు పర్యావరణ, అటవీశాఖ, రెవెన్యూ, పోలీసు శాఖలు బందంగా ఏర్పడి పరిశ్రమలను ఆకస్మిక తనిఖీ చేయాల్సి ఉంది. అటవీ సంపదను అక్రమంగా వినియోగించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

8న పాపిరెడ్డిపల్లికి జగన్ రాక

- బాధిత కుటుంబానికి పరామర్శ
- బెదిరింపులు, దౌర్జన్యాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలి
- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- ప్రజలను భయపెడుతున్న పరిటాల కుటుంబం
- వైసిపి నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈనెల 8వ తేదీన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి విచ్చేస్తున్నారని వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో తమకు బలం లేకున్నా అధికార బలంతో ఎంపిపి స్థానాలను గెలుచుకునే ప్రయత్నాలను టిడిపి చేసిందని విమర్శించారు. అందుకు వైసిపి నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో కురుబ లింగమయ్యను హత్య చేసారన్నారు. ఉమ్మడి జిల్లాలో తిరిగి ఫ్యాక్షన్‌ను పెంచి పోషించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు అధికారపార్టీ నేతల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తుండటం విచారకరమన్నారు. అధికారపార్టీ నేతల ఆదేశాలకు అనుగుణంగా వారు నడుచుకునే పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. వారు ఆదేశిస్తే పోలీసు స్టేషన్లు కూడా మార్చుకుంటారా అని ప్రశ్నించారు. అధికారపార్టీ చేపడుతున్న ఈ అరాచకాలకు ఎండగట్టడంతోపాటు వైసిపి నాయకులు, కార్యకర్తలకు మనోధైర్యం ఇచ్చేందుకు వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈనెల 8వ తేదీన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి విచ్చేస్తున్నారని తెలిపారు.

జెసిబిల శబ్దం వింటేనే జనాలకు నిద్రపట్టడం లేదు
తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

రాప్తాడు నియోజకవర్గంలో రాత్రి సమయాల్లో జెసిబిల శబ్దం విన్నా నిద్రపట్టని పరిస్థితులు ప్రజల్లో నెలకొందని వైసిపి నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నాడు వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గం పరిధిలో ఇళ్లను రాత్రిరాత్రికి పడగొడుతుంటే జనం భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. తిరిగి నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను పురిగొల్పే చర్యలు సరైంది కాదని అన్నారు. అధికారం వచ్చింది ప్రజలకు మంచి చేయడానికేనని తెలిపారు. పరిటాల కుటుంబం ప్రజలకు మేలు చేయకపోగా భయభ్రాంతులకు గురి చేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వారి ఆస్తులను లాక్కోవడమే కాకుండా అవినీతి పాల్పడుతున్నారన్నారు. కక్కలపల్లి టమోట మండీల నుంచి పంచాయతీలకు చెందాల్సిన డబ్బులను తమ సొంతానికి వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలకు మంచి చేయడం కోసం అహర్నిశలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషి చేసారన్నారు. గతంలో నియోజకవర్గంలో ఉచితంగా బోర్లు వేసామని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు కట్టించే పనులను చేపడితే దానిపైనా అనేక ఆరోపణలను పరిటాల సునీత చేయడమే కాకుండా విజిలెన్స్ విచారణ చేపట్టే విధంగా ప్రయత్నించారన్నారు. విజిలెన్స్ విచారణలోనూ డబ్బులు కాంట్రాక్టు సంస్థకే ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని నివేదిక ఇచ్చారన్నారు. ఇప్పటికైనా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించి ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు. ఈనెల 8వ తేదీన వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు విచ్చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర రవాణా మంత్రిని కలిసిన ఆర్టీసీ ఛైర్మన్

అనంతపురం : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఎపిఎస్ ఆర్టీసీ రాయలసీమ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఆర్టీసీలో ఉన్న సమస్యలు, ప్రజా రవాణా, ఆర్టీసీ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జోనల్ ఛైర్మన్ అప్పలనాయుడు, నెల్లూరు జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



పామిడిలో మూతబడిన టెక్స్‌టైల్ పార్కు

టెక్స్‌టైల్ పార్క్‌ను తెరిచేరా..?

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ప్రజాశక్తి-పామిడి

మహిళల ఆర్థిక స్వాలంభనలో భాగంగా చేనేత రంగంలో శిక్షణ ఇచ్చి వారికి సాయం అందించేలా పామిడి ఎన్‌హెచ్-44 వై జంక్షన్ వద్ద 2.77 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.1.76 కోట్ల వ్యయంతో 2004లో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో టెక్స్‌టైల్ పార్క్ కింద మహిళలకు శిక్షణ, పరిశోధన సౌకర్యాలు కల్పించే ఏర్పాటు చేశారు. దీనికి ఏర్పాటు ఆశయం బాగానే ఉన్నా ఆచరణలో పాలకులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం అడుగడుగునా కన్పించింది. మహిళా సాధికారతకు ప్రోత్సాహం అందించే దిశగా పయనించాల్సిన ప్రభుత్వాలు ఈ మేరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిధుల కొరత పేరుతో దీనిని నిర్వహణను మూలనపడేశారు. టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేసిన స్థలం వివాదంలో ఉండడం దీని నిర్వహణకు అదనపు సమస్యగా మారింది. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చేందుకు టెక్స్‌టైల్ పార్క్‌కు తెచ్చిన సామగ్రిని ఉపయోగించకపోవడంతో అవి ఎందుకూ పనికిరాకుండా మూలనపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ త్వరలో కొత్త వస్త్ర విధానాన్ని ఆవిష్కరిస్తామని, పామిడిలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మంత్రి చేసిన ప్రకటనతో పామిడి టెక్స్‌టైల్ పార్కు మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే పామిడిలో మూతబడిన టెక్స్‌టైల్ పార్క్‌ను తెరిపిస్తారా.. లేక కొత్తది ఏర్పాటు చేస్తారా అన్నదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. స్థానిక ప్రజలు మాత్రం మూతబడిన టెక్స్‌టైల్ పార్కును తెరిపించాలని కోరుతున్నారు.

స్థానికులకు ఉపాధి

పామిడిలో మూతబడిన టెక్స్‌టైల్ పార్కును తెరిపిస్తే అందులో శిక్షణ తీసుకుని మహిళలకు ఉపాధి లభిస్తుంది. మండల వ్యాప్తంగా దాదాపు 5 దశాబ్దాలకుపైగా వేల మందికి కుట్టు పరిశ్రమ ఉపాధినిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మూత పడిన టెక్స్‌టైల్ పార్క్‌ను పున:ప్రారంభమైతే పేదల ఉపాధి మెరుగుపడే అవకాశం ఉంది.

రాము,
వస్త్ర వ్యాపారి,పామిడి.

రెవెన్యూ సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్



కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రెవెన్యూ సమస్యలపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వాటిని ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సెక్టార్, రీసర్వే, తదితర అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దష్టి సారించాలన్నారు. నీటి పన్నుల వసూలును వేగవంతం చేయాలన్నారు. రీసర్వే ప్రక్రియ మొదటి దశకు సంబంధించి డిఎల్ఆర్‌లో పురోగతి తీసుకురావాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన పిజిఆర్ఎస్ సమస్యలను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ ఎ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

హేతుబద్ధంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ విద్యార్థుల తల్లిదండ్రుల అభీష్టం మేరకు హేతుబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిఈవో, సమగ్ర శిక్ష ఎపిసి, కళ్యాణదుర్గం నియోజకవర్గం మండల విద్యాశాఖ అధికారులతో పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీల ఆమోదంతో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, పిఎంయు మెంబర్లు నాగరాజు, మదన్మోహన్, గురు మునికృష్ణ, కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎంఇఒలు పాల్గొన్నారు.

"అనంత ఆణిముత్యాలు" కింద విద్యార్థులకు సాయం

"అనంత ఆణిముత్యాలు" ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ కింద ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు సహాయం అందించాలని కలెక్టర్ వినోద్ తెలిపారు. "అనంత ఆణిముత్యాలు" ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్మెంట్ సొసైటీపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎవరైనా సామాజిక ఆర్థికంగా వెనుకబడి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థులను గుర్తించి కమిటీ దష్టికి తీసుకురావాలన్నారు. వీరికి అనంత ఆణిముత్యాల ద్వారా సాయం అందించేలా వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ ఎ.మలోల వివిద శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉట్లమాను ఉత్సవం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలో వెలసిన తిక్కస్వామి ఆలయ ఆవరణంలో బుధవారం నిర్వహించిన ఉట్లమాను పరుష కన్నుల పండువగా సాగింది. వేడుకను మండలంతోపాటు అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ముందుగా తిక్కస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు కార్యనిర్వాహకులు ఉట్లమాను ఉత్సవాలను ప్రారంభించారు. దీంతో యువకులు రెండువర్గాలుగా ఏర్పడి ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడ్డారు. చివరకు ఉట్లమాను ఎక్కిన చిలమకూరి రామకృష్ణను నిర్వాహకులు సన్మానించారు. కాగా ఆలయ పరిసరాల్లో చెక్కభజన, కోలాటం పోటీలు, ఇరుసు ఎత్తే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వెంకట్ వకుళా ఫౌండేషన్, టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు), మొరుసు భాస్కర్‌రెడ్డి, మోరుసు అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, పులిహోరా పంపిణీ చేశారు.



ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

క్యూబాకు అండగా నిలుద్దాం : సిఐటియు



క్యూబాకు మద్దతుగా నిధి వసూలు చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చిన్న దేశాలను కూడగట్టుకుని ముందుకెళ్తున్న క్యూబాను ఇబ్బందులకు గురి చేస్తున్న అమెరికాకు బుద్ధి చెప్పేలా భారత దేశ ప్రజలందరూ క్యూబాకు మద్దతుగా నిలవాలని సిఐటియు నాయకులు కోరారు. క్యూబాకు సంఫీుభావంగా సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం బుధవారం నాడు నిధి వసూలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకిస్తున్న క్యూబాను అమెరికా ఇబ్బందులకు గురి చేసేలా దిగుమతిని పూర్తిగా నిలుపుదల చేసి అక్కడి ప్రజలకు తిండి లేకుండా చేస్తోందన్నారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రపంచ కార్మిక వర్గానికి క్యూబా స్ఫూర్తిదాయకం అన్నారు. ప్రజలందరికీ విద్యను సమానంగా అందిస్తున్న దేశమన్నారు. విద్య, వైద్యంలో నేటికీ ఒక శాతం కూడా ప్రయివేటు రంగం క్యూబాలో అడుగుపెట్టకుండా ప్రజల హక్కుగా ఉన్నాయన్నారు. సోషలిస్టు విధానాలను సంపూర్ణంగా అమలు చేస్తూ ప్రజా పాలన సాగిస్తున్న క్యూబాపై అమెరికా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేలా దేశ ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకట్ నారాయణ, హమాలీ యూనియన్ నాయకులు ఆదినారాయణ, వెంకటేశులు, రాజన్న, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి




కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు జనాభాకు తగ్గట్టు కార్మికుల సంఖ్య పెంచాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ బాలస్వామికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సిఐటియు కార్యదర్శి వెంకట్ నారాయణ మాట్లాడుతూ టెక్నికల్ సమస్యలతో వేతనాలు పడని కార్మికులకు, జీతాలు చెల్లించాలని కోరారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, రెగ్యులర్ కార్మికులకు బకాయి సరెండర్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదనపు కార్మికులకు రూ.15వేల వేతనం ఇవ్వాలని, బకాయి జీతాలు చెల్లించాలని, వేసవికాలం దృష్ట్యా మండుతున్న ఎండల నుంచి కార్మికులకు పని భారం తగ్గించి, ఉదయం పూటే విధులు నిర్వహించేలా సడలింపు ఇవ్వాలని, కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, టోపీలు, మస్టర్ పాయింట్ దగ్గర నీటి సదుపాయం కల్పించాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్తుజ, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేష్, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ తహశీల్దార్ సస్పెన్షన్‌కు డిమాండ్



రైతులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తహశీల్దార్ మునివేలు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

రైతులతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా చిన్నచూపు చూస్తూ చులకనగా మాట్లాడుతున్న డి.హీరేహాల్ తహశీల్దార్ మునివేలును సస్పెండ్ చేయాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గొడిసెలపల్లిలో గ్రామంలోని కుడ్లూరు పొలానికి వచ్చిన తహశీల్దార్ స్థానిక రైతులను 'నా ముందే పంచెలు పైకి కట్టుకుంటావా.. కిందికి దించు..' అంటూ చులకనగా మాట్లాడారన్నారు. అంతేగాకుండా తాను చెప్పిందే వినాలని, సమాధానం చెప్పకూడదని హుకుం జారీ చేయడం బాధాకరమన్నారు. రైతులతోపాటు స్థానిక అత్యవసరమై విఆర్ఎ ఫోన్‌లో మాట్లాడుతుండగా పరుషంగా మాట్లాడటంతోపాటు నెల వేతనం కట్ చేస్తామని హెచ్చరించడం విడ్డూరంగా ఉందన్నారు. అనుచితంగా ప్రవర్తించిన తహశీల్దార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

రాయదుర్గం మీదుగా మైసూర్-అజ్మీర్‌కు ప్రత్యేక రైలు

ప్రజాశక్తి-రాయదుర్గం

వేసవి రద్దీ నివారణకు మైసూరు నుంచి అజ్మీర్‌కు ప్రత్యేక రైలు సర్వీసును నడపనున్నట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బిఎల్ శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 06281వ నెంబర్ రైలు ఏప్రిల్ 5, 12, 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14వతేదీల్లో శనివారం(11 సర్వీసులు) ఉదయం 8 గంటలకు మైసూర్ నుంచి బయలుదేరి అజ్మీర్‌కు సోమవారం ఉదయం 6:55 గంటలకు చేరుతుందన్నారు. అలాగే ట్రైన్ నెంబర్ 06282 ఏప్రిల్ 7, 14, 21, 28, మే 5, 12, 19, 26, జూన్ 2, 9, 16వతేదీలో (11 సర్వీసులు) సోమవారం సాయంత్రం 6-50కు బయలుదేరి పై తెలిపిన మార్గంలోనే బుధవారం సాయంత్రం 5:30 కు మైసూరు చేరుతుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఈ ప్రత్యేక రైలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కురుబలపై దాడులు హేయం

ఆత్మకూరు ఎంపిపి హేమలత, కన్వీనర్ బాలపోతన్న

ప్రజాశక్తి-ఆత్మకూరు



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో కురుబలపై వరుస దాడులు చేయడం హేయమైన చర్య అని ఎంపిపి సుబ్బర హేమలత, వైసిపి మండల కన్వీనర్ బాలపోతన్న, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కురుబ పార్వతమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ వర్గాలపై దాడులు, హత్యా రాజకీయాలు పెరిగిపోయాయన్నారు. ముఖ్యంగా జిల్లాలో కురుబలనే లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని కురుబలను సమిధలుగా వాడుకుంటూ, ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టగానే తిరిగి తమపైనే దాడులు చేసి హతమార్చడం పరిటాల కుటుంబానికే చెల్లుతుందని ఆరోపించారు. పది నెలల కూటమి ప్రభుత్వ పాలనలో జిల్లాలో వరుసగా కురుబలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ఇలాంటి నీచ రాజకీయాలకు కూటమి నేతలు స్వస్తి పలకాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

గుత్తిని కరువు మండలంగా ప్రకటించాలని వినతి

ప్రజాశక్తి-గుత్తి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

గుత్తి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ డి.ఓబిలేసుకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో గుత్తి లేకపోవడం అన్యాయమన్నారు. ప్రతి ఏటా అతివృష్టి, అనావృష్టి కారణంగా గుత్తి మండలంలో రైతులు, రైతు కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది కూడా పంటలను సాగు చేసిన రైతులు దిగుబడులు రాక ఆర్థికంగా నష్టపోయారని చెప్పారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం గుత్తిని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుసంఘాలను కలుపుకుని దశలవారీగా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రేవతి, కవిత, సావిత్రి, కుల్లాయప్ప, శివ, జయమ్మ, డివైఎఫ్ఐ నాయకుడు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి పనిచేస్తా..



జగన్‌కు బొకే అందజేస్తున్న ఆలూరు సాంబ శివారెడ్డి

శింగనమల : మాజీ సిఎం జగన్ ఆదేశాల మేరకు అంకితభావంతో పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వైసిపి ఎస్‌సి వింగ్ జోనల్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబ శివారెడ్డి తెలిపారు. ఎస్‌సి వింగ్ కో ఆర్డినేటర్ పదవిని ఇవ్వడంపై బుధవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో వైసిపి అధినేత జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సాంబ శివారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రారంభమైన తొలిరోజు నుంచి జగనన్న నాయకత్వంపై నమ్మకంతోనే పని చేస్తున్నామన్నారు. నిరంతరంగా పార్టీ కార్యాచరణలో పాల్గొంటూ అంకితభావంతో పని చేశానన్నారు. తన రాజకీయ జీవితం మొత్తాన్ని అధినేత జగనన్న ప్రజా సంక్షేమ దీక్షలో సాగించిన పోరాటానికి అంకితం చేశానన్నారు. ఎస్‌సి వింగ్ కో ఆర్డినేటర్‌గా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైసిపి అభిమానులను ఒకేతాటిపైకి తీసుకురావడానికి నిబద్ధతతో కష్టపడి పని చేస్తానని చెప్పారు.

కళ్ల సమస్యలపై అవగాహన

యాడికి : అంధత్వ నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని పిన్నేపల్లి గ్రామంలో కళ్ల సమస్యలపై తాడిపత్రి డివిజన్ ప్రభుత్వ నేత్ర వైద్యాధికారి మధుసూదనరాజు బుధవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్లకోమా, శుక్లాలు, దృష్టి లోపాల నుంచి కళ్లను ఎలా కాపాడుకోవాలనే అంశాలపై వివరించారు. అనంతరం కంటి పరీక్షలు చేసి పలువురికి శస్త్ర చికిత్సల అవసరం కావడంతో జిల్లాకేంద్రంలోని శారదానగర్ ఉన్న కేంద్రానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో యాడికి పిహెచ్‌సి వైద్యాధికారి పరమేశ్వర్, 104 అనిల్, హెచ్‌ఎస్ ఎఆర్‌పి గౌడ్, వైద్య సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.గోవిందమ్మ, ఉపాధ్యాయురాలు బి.భాగ్యలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్ షేక్ రేష్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపాలి

గుంతకల్లు : నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి ఆర్టీసీ డిపోల నుంచి ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం గుంతకల్లు ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు ఆర్టీసీ డిపోలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజర్ నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపడం లేదన్నారు. బస్టాండ్లలో సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు డిపోల్లో ఎక్కువ శాతం అద్దె బస్సులే ఉన్నాయన్నారు. గతంలో కళ్యాణదుర్గం, పత్తికొండ, ఉరవకొండ, రాయదుర్గం, పెద్దవడుగూరు, నాగసముద్రం, బేతంచర్లకు సర్వీసులు ఉండేవన్నారు. కావున ఆయా రూట్లలో బస్సులు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, ఎస్ఎండి గౌస్, రాముడాయల్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

రాయదుర్గం : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పిలుపుమేరకు స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో కార్యదర్శి తిప్పేస్వామి నాయకత్వంలో నిరసన వ్యక్తం చేసి ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ కార్యదర్శి సతీష్‌కుమార్, సహాయ కార్యదర్శి రమేష్, ప్రచార కార్యదర్శి నఫీజ్, ఉద్యోగులు బాలాజీనాయక్, నారాయణ, బిపి రెడ్డి, రాఘవ, హరినాథ్, సుకన్య, చిట్టెమ్మ, వెంకోజీ, వంశీ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ రోహినాథ్

శింగనమల : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వందశాతం సాధారణ ప్రసవాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రోహినాథ్ తెలిపారు. బుధవారం స్థానిక సిహెచ్‌సి వైద్యశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీలు, మాతా శిశు సేవలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా గర్భిణులకు ఆరోగ్య కేంద్రాల్లోనే పరీక్షలు నిర్వహించి వంద శాతం సాధారణ డెలివరీలు జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగానే ప్రతి సోమ, శుక్రవారాల్లో గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచ 'ఆటిజం'పై అవగాహన

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి నెం99లో బుధవారం ప్రపంచ ఆటిజంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఇబి దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మనోవైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, మానసిక వైద్య విభాగం నుంచి డాక్టర్ రవినాయక్ ఆటిజం వ్యాధి లక్షణాలు, పిల్లల్లో కనిపించే సమస్యలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సా విధానాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె డిఇఐసి, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ జి.నారాయణస్వామి, క్లినికల్, చైల్డ్ సైకాలజిస్ట్ సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిద్దాం

నిరసనల్లో ముస్లిములు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



అనంతపురంలో నిరసన తెలుపుతున్న ముస్లిములు

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిద్దామని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ జాఫర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు నదీమ్, మేయర్ వసీం పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు, వక్ఫ్ సవరణ బిల్లు-2024ను పార్లమెంటులో ప్రవేశపెట్టడం బాధాకరమన్నారు. వక్ఫ్ ఆస్తులకు వివాదం వస్తే, హైకోర్టు న్యాయమూర్తి నియమించిన ట్రిబ్యునల్ ఉందన్నారు. ఇప్పుడు ఈ బిల్లులో కలెక్టర్లకు అధికారం ఇచ్చారన్నారన్నారు. ఇప్పుడు ఆయా ఆస్తులను దోచుకునేందుకు దాగిన కుట్రలో భాగంగానే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ముమ్మాటికీ ఈ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కావున ఈ బిల్లును ప్రతి ఒక్కరం వ్యతిరేకిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాదా గాంధీ, రిజ్వాన్, ఫయాజ్, ఖాజాహుస్సేన్, బాషా, అల్లీపీరా, ఇమామ్, బాషా, వలి, రామిరెడ్డి, టిప్పు సుల్తాన్ జాకీర్, ముక్తియార్, పాళ్యం నారాయణస్వామి, రాజేష్‌గౌడ్, రాజు, జమాతే ఇస్లాం హింద్, జిలాన్ గరీబ్ దర్ద్ ట్రస్టు, షమ్ము, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును లోక్‌సభ, రాజ్యసభల్లో వేర్వేరుగా ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో బుధవారం రాయదుర్గంలో ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా అత్యధిక సంఖ్యలో ముస్లిములు స్థానిక జామియా చౌక్ మస్‌జిద్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వచ్చి డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం లోక్‌సభలో, గురువారం రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈ బిల్లును ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, ఎంఐఎం ప్రతినిధి బ్రెడ్ షర్మస్, న్యాయవాది అబ్దుల్ వహాబ్, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : వక్ఫ్ బోర్డు బిల్లుపై కేంద్ర ప్రభుత్వ పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని ముస్లిములు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతోపాటు ఉద్దేహాల్, శ్రీధర్‌ఘట్ట, గోవిందవాడ, కళ్లుదేవనహళ్లి, చంద్రగిరి, గోనేహాల్, నేమకల్లు గ్రామాల్లోని ముస్లిములు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలు, ముస్లిం ఆస్తులపైన పెత్తనం చెలాయించాలని చూడటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని కులాలు, మతాలనూ సమానంగా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రజలను విభజించి పాలించడమే అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వీరి ఆందోళనలకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిఐటియు, హమాలీ యూనియన్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

సివిల్ సప్లైలో పని చేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, సివిల్ సప్లయి జిల్లా హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్‌వి నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో సివిల్ సప్లై జిల్లా హమాలీ యూనియన్ (సిఐటియు) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 నెలలుగా హమాలీల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కూలి రేట్లు క్వింటాకు రూ.25 నుంచి రూ.28కు పెంచామని, 2024 జనవరి నుంచి అరియర్స్ రూపంలో కూలి రేట్లు చెల్లించడంతోపాటు బోనస్ 500, స్వీట్ 300కు పెంచుతూ సివిల్ సప్లై మంత్రి మనోహర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే ఆదేశాలు జారీ చేసి 14నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రధానంగా హమాలీలకు పెండింగ్‌లో ఉన్న ఇఎస్ఐ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎండాకాలం దృష్ట్యా హమాలీలకు నీటి సౌకర్యం కల్పించాలని, బకాయి అరియర్స్, దుస్తులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు నారాయణస్వామి, మేస్త్రీలు నారాయణస్వామి, ముని, గోపాల్, రామచంద్ర, కనేకల్ సురేష్, అక్కులప్ప, సూరి, పెద్దిరాజు, హమీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్



ఎమ్మెల్యే జయరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. బుధవారం పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు అందజేసిన సమస్యల సంబంధించి అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో భాగంగా గుత్తిలో ప్రతి బుధవారం అర్జీలను స్వీకరిస్తామన్నారు. సమస్యలు ఉంటే తమ దష్టికి తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుత్తి పామిడి మండలాల ఇంచార్జి గుమ్మనూరు ఈశ్వర్, నాయకురాలు డాక్టర్ హిమబిందు, టిడిపి గుత్తి పట్టణ కన్వీనర్ ఎంకె.చౌదరి, నాయకులు జక్కలచెరువు ప్రతాప్,చికెన్ శీనా,బి.రమేష్, కోనంకి కష్ణ, న్యాయవాది సోము, బోయ వేణుగోపాల్, పిల్లెల్లి సుధాకర్, పిల్లెల్లి కష్ణయ్య, కొనకొండ్ల సూరి, ఇసాక్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, టౌన్ బ్యాంక్ అధ్యక్షులు ఎస్. అబ్దుల్ జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం వినతి

జెడ్.వీరారెడ్డి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల కోరారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ జెడ్ వీరారెడ్డి కాలనీకి ప్రధాన రహదారిని నిర్మించాలన్నారు. ఇంటింటికి పైపులైను ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేయాలన్నారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు నాటి వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం నాయకులు రేవతి, కవిత, సావిత్రి, కుల్లాయప్ప, శివ, జయమ్మ, డివైఎఫ్ఐ నాయకుడు అశోక్, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-గార్లదిన్నె



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు వచ్చాయన్నారు. గత ప్రభుత్వం రీ-సర్వే పేరుతో చేసిన భూ తప్పిదాలు, భూ మార్పిడి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల భూములపై దౌర్జన్యాలు చేసిన ఘటనలకు సంబంధించి వినతులు అందజేశారన్నారు, వీటన్నింటిపై విచారించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. గత వైసిపి ప్రభుత్వం గ్రామాల్లోని నీటి ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్వీర్యం చేశారన్నారు. అయితే అలాంటి నిర్లక్ష్యం చేయకుండా గ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులును ఆదేశించారు. దీంతోపాటు గ్రామాల్లోని మురికి కాలువలను శుభ్రం చేయాలని, వీధి లైట్ల గురించి ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని తెలిపారు. అలాగే అర్హులందరికీ ఇంటి పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈరమ్మ, ఎంపిడిఒ యోగానందరెడ్డి, మండల కన్వీనర్ పాండు, టిడిపి నాయకులు గుర్రం ఆదినారాయణ, చంద్రశేఖర్‌నాయుడు, నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

పవర్, హ్యాండ్ బోర్ల పరిశీలన

అనంతపురం కార్పొరేషన్ : ఆసార్ వీధి, మున్నానగర్, పాతూరులో ఉన్న పవర్ బోర్లు, హ్యాండ్‌బోర్ల (చేతిపంపు)ను కమిషనర్ బాలస్వామి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నగరంలో పవర్ బోర్లు 199 ఉండగా 185 పని చేస్తున్నాయన్నారు. మిగిలినవి రిపేరీ చేయించామన్నారు. ఇక హ్యాండ్ బోర్లు 224 ఉండగా 214 రన్నింగ్‌లో ఉండగా మిగతా బోరు ఎండిపోయాయని సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఎండాకాలం అయినందున నీటిఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలో భాగంగా నగరంలో ఎక్కడైనా బోర్లు పాడైపోయి ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. తర్వాత జూనియర్ కాలేజ్, గుత్తి రోడ్డు వద్ద ఉన్న అన్నా క్యాంటీన్లలో ఉదయం అల్పాహారం పంపిణీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజనీర్ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

ఉరవకొండ : మండలంలోని మోపిడి గ్రామంలో రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్ జి.శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బయట ఎండలో తిరగరాదన్నారు. అత్యవసరమై ఎక్కడికైనా వెళ్లేటప్పుడు నీరు తీసుకెళ్లాలన్నారు. తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలని, కాళ్లకు చెప్పులు, తలకు టోపీ, తలపాగా ధరించాలని సూచించారు. ఒకవేళ్ల ఎండకు తిరిగి తలనొప్పి, తల తిరగడం నీరసం, జ్వరం, నాలుక ఎండిపోవడం, స్పృహకోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చెట్టు నీడకు తరలించాలన్నారు. ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ హెప్సిబా, ఎఎన్ఎం అనూషా, ఆశాలు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వడదెబ్బపై అవగాహన కల్పించారు. ముందుగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు మండల కేంద్రంలోని సచివాలయం-3లోని ఎం ఎఫ్ టు డైరీ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ శిరీషకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జుబేదా, ఎఎన్ఎం మరియమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

యువతతోనే సమసమాజ నిర్మాణం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అనంతపురం కలెక్టరేట్ : సమసమాజ నిర్మాణంలో యువత పాత్ర చాలా కీలకమైందని కురుగుంట ఎంపియుపి ప్రధానోపాధ్యాయులు వర్మ, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్ అన్నారు. బుధవారం అనంతపురం రూరల్ పరిధిలోని కురుగుంట గ్రామంలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ సర్వీస్ స్కీం స్పెషల్ క్యాంపును ప్రారంభించారు. ముందుగా స్వామి వివేకనంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యధిక శాతం యువత ఉన్న దేశం భారతదేశం అన్నారు. నేషనల్ సర్వీస్ స్కీం ద్వారా విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. గ్రామీణంలో అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, బాల్యవివాహాలు, రక్తదానం, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య రుగ్మతల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి కె.మహేంద్ర, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్‌తో సమీక్ష

అనంతపురం : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమావేశ భవనంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఇబి దేవి అధ్యక్షతన జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు బుధవారం నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వ్యాధి గ్రస్తులకు వారి పరిస్థితిని బట్టి డాక్టర్ సలహా మేరకు నాణ్యమైన పరీక్షలు తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ఈ కారక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్టు మృతి

రాప్తాడు : రాప్తాడు సీనియర్ జర్నలిస్టు నాగరాజు అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. నాగరాజు గత కొద్దికాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం రాత్రి ఆరోగ్యం విషమించడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండలంలోని జర్నలిస్టులు నాగరాజుకు నివాళులర్పించారు.

ఉపాధ్యాయురాలికి 'గురుదేవోభవ' అవార్డు

రాయదుర్గం : రాయదుర్గం మండలం చదం గ్రామానికి చెందిన పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.హేమలతను గురుదేవోభవ ఉపాధ్యాయ అవార్డు వరించింది. బుధవారం గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో అమరావతి ఒలింపియాడ్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి హేమలతకు అవార్డును అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లోని 30 మంది ఉపాధ్యాయులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు.

దివ్యాంగురాలికి అంతిమ సంస్కారాలు

అనంతపురం సిటీ : స్థానిక మరటి కాలనీకి చెందిన దివ్యంగురాలు తిరుమలప్ప గారి లక్ష్మీదేవి (43) అంతిమ సంస్కారాలను సాయిట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. లక్ష్మీదేవి వైరల్ ఫీవర్‌తో పరిస్థితి విషమించి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె భర్త తిమ్మారెడ్డి కూడా దివ్యాంగుడే కావడంతో సమీప బంధువు శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి మేరకు సాయి ట్రస్టు ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్‌లో అంతిమ సంస్కారాలు నిర్వహించినట్లు ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్టు సభ్యులు నారాయణనాయక్, మహేష్, కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పరిటాల' క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్

అనంతపురం రూరల్ : అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

'కిశోర వికాసం'పై అవగాహన

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో కిశోర వికాసం కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా కిషోర్ దశలో ఉన్న బాలికలను గుర్తించడంతోపాటు అనుసరించాల్సిన జాగ్రత్తలు, పరిపక్వతపై ఎలా అవగాహన కల్పించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మీదేవమ్మ, ఎంపిడిఒ గూడెన్న, సిడిపిఒ రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పిఎండిఎస్ విధానంతో రైతులకు లాభాలు

ప్రజాశక్తి-అనంతపురం



పిఎండిఎస్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పిఎండిఎస్ విధానంతో పంటలు సాగు చేయడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ప్రకృతి వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్ ఆదేశాల మేరకు బుధవారం అనంతపురం మండలంలోని కందుకూరు గ్రామంలో రైతు పెద్దిరెడ్డి రైతు పొలంలో పిఎండిఎస్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ప్రజలకు ఆరోగ్యకరమైన దిగుబడులను అందించవచ్చున్నారు. వర్షం రాకముందే విత్తనాలను భూమిలో వేయడం వల్ల వర్షం వచ్చిన వెంటనే విత్తనాలను మొలుస్తాయన్నారు. ఈ విధానంలో 5 రకాల పంటలు, 20 రకాల జీవ వైవిధ్య పంటలను జీవామృతంలో విత్తన శుద్ధి చేసి ఘన జీవామృతం కలిపిన విత్తనాలను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్.1 ఉమాశంకర్, ఎల్.2 ఓబుళపతి, సిఆర్‌పిలు సంజీవరెడ్డి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గొర్రెల కాపరి ఆత్మహత్య



ఉరేసుకున్న వన్నూరుస్వామి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని ముప్పలకుంట గ్రామానికి చెందిన బోయ పశువుల వన్నూరు స్వామి (20) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. వన్నూరుస్వామి మూడేళ్ల క్రితమే జీవనోపాధి కోసం సొంత గ్రామాన్ని వదిలి ఆత్మకూరు మండలం గొరిదిండ్ల ముట్టాలలోని ఓ రైతు వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తూ పని చేస్తున్నాడు. ఇందులో భాగంగానే వన్నూరుస్వామి మంగళవారం ఉదయం గొర్రెలు మేపేందుకు పొలాలకు వెళ్లాడు. అయితే సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. దీంతో యజమాని పలుచోట్ల గాలింపు చర్యలు చేపట్టాడు. ఆచూకీ తెలియకపోవడంతో ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అటుగా వెళ్లిన పశువుల కాపర్లు గ్రామ సమీపంలో వేపచెట్టుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందించారు. ఆత్మకూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతునికి తల్లి, తండ్రి, అన్న, పెద్దమ్మ ఉన్నారు.

హుండీని ఎత్తుకెళ్లిన దొంగలు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న హుండీని మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో కూడా ఇదే ఆలయంలో రెండుసార్లు చోరీ జరిగిందని చెప్పారు. వెంటనే పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుని శిక్షించాలని కోరారు.